29న ఎస్ఆర్‌కెఆర్‌లో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 29న నిర్వహించే మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. స్థానిక కలెక్టరేట్లో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ వాల్‌పోస్టర్‌ను ఆమె ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లా యువతీ, యువకులకు ఉద్యోగావకాశాల కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఆధ్వర్యంలో నిర్వహించే ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో సుమారు 28 ప్రముఖ కంపెనీలతోపాటు మరికొన్ని ఇతర కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తానన్నారు. వివిధ కంపెనీల్లో మొత్తం మూడు వేలకుపైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తారని, 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని చెప్పారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్, ఎన్‌సిఎస్‌వైపి.కిషోర్‌రెడ్డి,ఆంజనేయులు పాల్గొన్నారు.

దగ్గులూరు మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించాలి

పిపిపి పద్ధతి విరమించుకోకపోతే ఉద్యమం ఉధృతం - రాష్ట్ర ప్రభుత్వానికి మెడికల్ కాలేజీ పరిరక్షణ కమిటీ హెచ్చరిక

దగ్గులూరు మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతంలో నినదిస్తున్న నేతలు, గ్రామస్తులు

ప్రజాశక్తి - పాలకొల్లు

దగ్గులూరులో మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించాలని, మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను విరమించుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ నేతలు స్పష్టం చేశారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో నిర్మాణంలో మెడికల్ కళాశాలను కమిటీ బృందం ఆదివారం పరిశీలించింది. అనంతరం పాలకొల్లులోని మెడికల్ అసోసియేషన్ బిల్డింగ్ వద్ద నిర్వహించిన సదస్సులో నేతలు మాట్లాడారు. గతంలో విద్యుత్‌ను ప్రయివేటుపరం చేసినప్పుడు పెద్దఎత్తున ఆందోళన చేశామని, మెడికల్ కళాశాలల విషయంలోనూ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దగ్గులూరు సర్పంచి విశ్వనాథం పేరయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కొలుకులూరి అర్జున్‌రావు, కాకర రాజ్‌కుమార్, బిఎస్‌పి నాయకుడు ఇవిసి.శేఖర్‌బాబు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నేత సోడదాసి గంగయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ, ఆల్ ఇండియా క్రిస్టియన్ వర్కింగ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మత్తే రాజ్‌కుమార్, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు కొల్లాటి పెద్దిరాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్.సుందర్, సీనియర్ అడ్వకేట్ జి.భాస్కరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, పిసిసి సభ్యులు కొరగింజల హరికిరణ్, కొలుకులూరి అర్జునరావు, దగ్గులూరు గ్రామస్తులు, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వం వైద్యరంగం నుంచి తప్పుకుని ఇక ప్రజలకు ఏం చేస్తారు

వి.లక్ష్మణరెడ్డి, కోకన్వీనర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ గుంటూరు

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరించి వైద్యాన్ని పూర్తిగా ప్రయివేటుపరం చేయాలని చూస్తున్నారు. ప్రభుత్వం వైద్యరంగ బాధ్యతల నుంచి పక్కకు తప్పుకుని ప్రజలకు ఇంకేం సుపరిపాలన చేస్తుంది. యోగాంధ్ర, వివిధ రకాల కార్యక్రమాల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టే ప్రభుత్వానికి కేవలం రూ.5 వేల కోట్లు మెడికల్ కళాశాలలకు ఖర్చుపెట్టలేదా. లూలూ వంటి కార్పొరేట్ సంస్థకు ప్రపంచంలో ఎక్కడా సెంటు స్థలం ఇవ్వలేదు. మన రాష్ట్రంలో విజయవాడ, విశాఖ నడిబొడ్డున స్థలాలు కేటాయించడం అన్యాయం. నేడు డబ్బుంటే వైద్య విద్య అనేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. దగ్గులూరులో మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించి నడపాలి. అప్పుడే పేదలకు వైద్యం పూర్తిస్థాయిలో అందుతుంది.

కరోనా కాలంలో ఆదుకున్నది ప్రభుత్వ వైద్యుల సేవలే

బి.బలరాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

పిపిపి అంటే ప్రజల ఆస్తిని పంచేయడమే. విద్య, వైద్యాన్ని ప్రయివేటీకరించడం అంటే ప్రజలందరికీ ఈ రెండింటినీ దూరం చేయడమే. కరోనా వంటి విపత్కర పరిస్థితిలో దేశంలో, రాష్ట్రంలోని ప్రయివేటు ఆసుపత్రులు చేతులెత్తేస్తే ప్రజలను కాపాడింది ప్రభుత్వ ఆసుపత్రులు మాత్రమే. ఒకవైపు మెడికల్ కాలేజీలు కార్పొరేట్లకు అప్పగించి, మరోవైపు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తూ రాష్ట్రంలో ప్రభుత్వ సంపదను పూర్తిగా కార్పొరేట్ల మయం చేస్తున్నారు.

పిపిపి నిర్బంధంగా అమలు చేస్తే పోరాటాలే దిక్కు

జడ శ్రావణ కుమార్, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు

కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పగలిగే వ్యక్తి దేశంలోనే చంద్రబాబు ముఖ్యుడు. రిజర్వేషన్లు లేని వ్యవస్థను స్థాపించడమే ఈ పిపిపి పద్ధతి లక్ష్యం. మెడికల్ కాలేజీల్లో పిపిపి అమలైతే ఒక్కో సీటు సుమారు రూ.3 కోట్లుపైనే ఉంటుంది. పిపిపిలో మెడికల్ సీట్లపై బహిరంగ చర్చకు మేం సిద్ధం. మీరు సిద్ధమా ప్రకటించండి. పిపిపి విధానం విరమించుకోకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదు. అనేక రూపాల్లో పోరాడుతాం.

లాభం లేకుండా సేవలందించే ప్రయివేటు సంస్థలున్నాయా

కోనాల భీమారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి

లాభం లేకుండా ప్రజలకు సేవ చేసే ప్రయివేట్, కార్పొరేట్ సంస్థలు ఎక్కడైనా ఉంటాయా. 1923లో కెజిహెచ్ పెట్టడానికి కారణం ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యం అందడం కోసమే. పిపిపి పద్ధతిలో ప్రజా సంపద ఎలా దోచుకుంటారో విజన్ ఉన్న చంద్రబాబుకి తెలీదా. ప్రజలంతా ముక్తకంఠంతో పిపిపి పద్ధతిని వ్యతిరేకిస్తున్నారు.

ప్రజల సంపద కార్పొరేట్లకు దోచిపెడతారా

ఎవి.పటేల్, పరిశ్రమల శాఖ పూర్వ అడిషనల్ డైరెక్టర్

నా రాజకీయ నాయకుడు అని అనుకొనే ప్రజలు ఆ నాయకులు ఎలాంటి దోపిడీ చేస్తారో తెలుసుకోవాలి. పిపిపి పద్ధతికి వ్యతిరేకంగా ప్రజా సంఘాలు చేసే ఉద్యమంలో మేము కూడా భాగస్వామ్యం అవుతాం.ప్రజలంతా ముక్తకంఠంతో పిపిపి పద్ధతిని వ్యతిరేకిస్తున్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలి

కొరివి వినయ్ కుమార్, కమిటీ రాష్ట్ర కోకన్వీనర్

ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉంటే నెలకు సుమారు 10 లక్షల మంది పేద ప్రజలు వైద్యం పొందొచ్చు. అవే కార్పొరేట్ ఆధీనంలో ఉంటే లక్షలాది రూపాయలు చెల్లించాలి. పిపిపి అంటే ప్రయివేటీకరణ కాదంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పుడు రాష్ట్రంలో ప్రయాణికుల వద్ద నుంచి ముక్కు పిండి వసూళ్లు చేస్తున్న టోల్‌గేట్లు పిపిపి పద్ధతిలోనివి కాదా. రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే ముందు ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలి.

విద్యుత్ పోరాటంలానే బాబుకు పిపిపి షాక్

జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల పరిరక్షణకు అన్ని సామాజిక, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలతో కలిసి ఐక్యంగా ఉద్యమిస్తాం. గతంలో ఏ సమస్య వచ్చినా రోడ్డెక్కిన స్థానిక ఎంఎల్‌ఎ, మంత్రి నిమ్మల రామానాయుడు తన సొంత ఇలాకాలో మెడికల్ కాలేజీని అమ్మేస్తుంటే ఏం చేస్తున్నారు. పిపిపికి వ్యతిరేకంగా సిపిఎం అగ్రభాగాన ఉండి పోరాడుతుంది.

ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారు

దిగుపాటి రాజగోపాల్, ఐలూ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ

రాష్ట్ర బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు మెడికల్ కాలేజీల నిర్మాణానికి ఖర్చు పెట్టలేని అసమర్థ సిఎం చంద్రబాబు. కార్పొరేట్లకు రాయితీల పేరుతో కోట్లాది రూపాయలు ఇవ్వడానికి మాత్రం డబ్బులుంటాయా. రాష్ట్రంలో ఎన్‌టిఆర్ ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మిస్తే, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 108, ఆరోగ్యశ్రీ తెచ్చారు. నిన్న వైసిపి, నేడు టిడిపి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తున్నారు.

చంద్రబాబుకు గుణపాఠం తప్పదు

పెండ్ర వీరన్న, సంచార జాతుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఒబిసి రాష్ట్ర మాజీ చైర్మన్

దగాకోరు పాలనలో ప్రభుత్వ సంస్థలను అమ్మేస్తున్నారు. పేద విద్యార్థులు డబ్బులేక వైద్య విద్యకు దూరమయ్యేలా చంద్రబాబు విధానం తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రులను, ప్రభుత్వ పాఠశాలలను దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రశ్నిస్తానని చెప్పిన పవన్ కళ్యాణ్ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై ఎందుకు నోరు మెదపడం లేదు.

నేడు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పర్యటన ఇలా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సోమవారం ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొనున్నారు. ఉదయం పది గంటలకు హైదరాబాద్ నుంచి విమానంలో రాజమండ్రి చేరుకుంటారు. 10.05 గంటలకు రాజమండ్రి నుంచి రోడ్డుమార్గం గుండా బయలుదేరి 11.30 గంటలకు కొయ్యలగూడెం మండలంలోని రాజవరం చేరుకుని పొంగుటూరు-లక్కవరం రోడ్డును పరిశీలిస్తారు. అక్కడ నుంచి 11.40కు బయలుదేరి ద్వారకాతిరుమల మండలం జగన్నాథపురంలోని లక్ష్మినరసింహస్వామి ఆలయానికి చేరుకుంటారు. 12 గంటకు దర్శనం చేసుకుని అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. దాదాపు 45 నిమిషాలు అక్కడ ఉండనున్నారు. అనంతరం రోడ్డుమార్గం గుండా రాజమండ్రి చేరుకుంటారు. అక్కడ నుంచి విమానంలో గన్నవరం చేరుకుంటారు. తొలుత రాజమండ్రి నుంచి హెలీకాప్టర్‌లో కొయ్యలగూడెం మండలంలోని రాజవరం చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. అనివార్య కారణాలతో హెలీకాప్టర్ ప్రయాణం రద్దు చేసి డిప్యూటీ సిఎం రోడ్డు మార్గంలో వచ్చేవిధంగా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయకపోతే గుణపాఠం తప్పదు

సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు

కోడేరులో సిఐటియు ఆధ్వర్యంలో లేబర్ కోడ్స్ పత్రాలను దహనం చేస్తున్న నేతలు

తణుకులో ఆందోళన

ప్రజాశక్తి - తణుకు

కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయకపోతే తగిన గుణపాఠం పాలకులు నేర్చుకోక తప్పదని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక వాన్‌బరి పరిశ్రమ వద్ద కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్స్‌ను నోటిఫై చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం గెజిట్ పత్రాలు దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలు రద్దు చేసి లేబర్ కోడ్‌లు తీసుకొచ్చారని విమర్శించారు. లేబర్ కోడ్స్ చాలా మంచివని ప్రభుత్వం ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అనేక సంవత్సరాలుగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కార్మిక సంఘాలు అడుగుతుంటే ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు లేబర్ కోడ్స్ ద్వారా ఎంత వేతనం పెరుగుతుందో చెప్పాలని ప్రశ్నించారు. లేబర్ కోడ్స్ వల్ల వేతనాలు, పని గంటలు, సమ్మె, ఉద్యోగ భద్రత వంటి సమస్యలు కార్మికులు ఎదుర్కోవాల్సివస్తుందన్నారు. కార్మికులపై ప్రేమ ఉంటే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. పాత కార్మిక చట్టాలున్నప్పుడే ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యుటీ, బోనస్, కనీస వేతనం, పని గంటలు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 26న దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై జరిగే ఆందోళనల్లో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ప్రతాప్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు గార రంగారావు, వల్లూరి వెంకటేశ్వరరావు, గుబ్బల గోపి, ఎం.గోవిందరాజు, అంబటి బ్రహ్మజీ, బి.త్రిమూర్తులు, పిఎస్ఎన్.మూర్తి, వినయకుమార్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, సత్యనారాయణ, ఫణీంద్ర, పోశారావు, అచ్చియ్య, పుల్లయ్య, సత్తిరాజు పాల్గొన్నారు.

ఆచంట: పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకే బిజెపి ప్రభుత్వం పని చేస్తుందని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్లను నోటిఫై చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం కోడేరులో వశిష్ట గోదావరి వద్ద లేబర్ కోడ్స్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. కేంద్రంలో మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై, లేబర్ కోడ్‌ల రద్దుకు భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తక్షణమే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బండి రంగారావు, నాయకులు నేతల చిత్తరంజన్, పిల్లి ప్రసాద్, నేలపాటి విజయలక్ష్మి, అంగన్వాడీ జిల్లా నేతలు వైట్ల ఉషారాణి, కేతా పద్మ, దిగుపాటి జ్యోతి, కాకర వెంకటేశ్వర్లు, పి.మోహన్‌రావు, తలుపూరి బుల్లబ్బాయి, తోటపల్లి సత్యనారాయణ, కొండేటి సత్యనారాయణ, కుసుమే జయరాజు, పద్మారావు, కూసంపూడి సుబ్బరాజు, బత్తుల విజయకుమార్, గంగారావు పాల్గొన్నారు.

ఆసుపత్రులపై ఏదీ పర్యవేక్షణ..!

- ప్రయివేటు ఆసుపత్రుల్లో నిబంధనలు తూచ్
- అత్యధిక ఆసుత్రుల్లో ఫైర్, ప్లానింగ్, విద్యుత్ అన్ని నిబంధనలు బేఖాతర్
- ప్రజలను ఇష్టానుసారంగా దోచేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువు
- ఏలూరు చైత్ర హాస్పటల్‌పై దాడితో ప్రయివేటు ఆసుపత్రులపై జనాల్లో చర్చ
- రెండు జిల్లాల్లో 400కు పైగా ప్రయివేటు ఆసుపత్రులు

చైత్ర ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రయివేటు ఆసుపత్రులపై పర్యవేక్షణ అనేది లేకుండా పోయింది. రెండు జిల్లాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. వైద్యఆరోగ్యశాఖ తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తోంది. ఆసుపత్రి నిర్మాణం నుంచి పార్కింగ్ వరకూ అన్నీ నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నా అడిగే నాథుడే లేకుండా పోయాడు. గత కొన్నేళ్లుగా రోగులను ఇష్టానుసారంగా దోచుకుతింటున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరులోని చైత్ర ఆసుప్రతిపై విజిలెన్స్ అధికారుల ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులు ఒక్కసారిగా దాడి చేయడం రెండు జిల్లాల్లోనూ హాట్‌టాపిక్‌గా మారింది. చైత్ర ఆసుపత్రితోపాటు నిబంధనలు పాటించని ప్రయివేటు ఆసుపత్రులన్నింటిపైనా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు ప్రయివేటు ఆసుపత్రులను గాడిన పెడతారో.. లేదో చూడాలి. ఏలూరు జిల్లాలో 250 ప్రయివేటు ఆసుపత్రులు ఉన్నాయి. వందకుపైగా వివిధ టెస్టులు నిర్వహించే ల్యాబ్‌లు, వంద వరకూ స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ దాదాపు అదేసంఖ్యలో ప్రయివేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. ప్రతిరోజూ వేల సంఖ్యలో రోగులు ఈ ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్తుంటారు. ఆసుపత్రి భవనం సరిగా నిర్మించారా.. ఫైర్ నిబంధనలు పాటించారా, విద్యుత్ కనెక్షన్లు, వైరింగ్ సక్రమంగా ఉన్నాయా, మెడికల్ స్టోర్స్ ఎలా నిర్వహిస్తున్నారు, పార్కింగ్ స్థలం ఉందా అనేవి ఏఒక్క అధికారీ పర్యవేక్షించిన పరిస్థితి లేదు. రెండు జిల్లాల్లో అత్యధిక ఆసుపత్రులు నిబంధనలకు విరుద్ధంగానే కొనసాగుతున్నాయి. అత్యధిక ఆసుపత్రులకు పార్కింగ్ స్థలం లేదంటే ఆశ్చర్యపోక తప్పదు. ఏలూరులోని అనేక ఆసుపత్రులకు రోడ్లనే పార్కింగ్ స్థలాలుగా ఉపయోగిస్తున్న పరిస్థితి ఉంది. ప్రయివేటు ఆసుపత్రుల్లో మెడికల్ స్టోర్స్‌లు, స్కానింగ్ సెంటర్ల నిబంధనల గురించి అడిగే నాథుడే లేకుండాపోయాడు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు అనేకం ఉన్నాయి. ఏదైనా ఫిర్యాదు వచ్చినప్పుడు తప్ప అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదు. అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు అందుతున్న కారణంగానే అటువైపు చూడటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోగుల ఇబ్బందులను ప్రభుత్వంగాని, జిల్లా అధికారులుగాని పట్టించుకోని దుస్థితి. ఏలూరు జిల్లాలో 31, పశ్చిమలో 23 ప్రయివేటు ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవలు సైతం అమలు జరుగుతున్నాయి. ఆయా ఆసుపత్రుల్లో పాటించాల్సిన నిబంధనల గురించి కూడా ఏఒక్క శాఖా పట్టించుకోవడం లేదు.

అతిపెద్ద వ్యాపారంగా వైద్యం

సేవాభావంతో చేయాల్సిన వైద్యాన్ని అతిపెద్ద వ్యాపారంగా మార్చేసిన పరిస్థితి ఉంది. ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలు రాజకీయ నాయకులను, అధికారులను గుప్పెట్లో పెట్టుకుని ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నాయి. చిన్నపాటి అనారోగ్య సమస్యతో ఆసుపత్రికి వెళ్లినా రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో రూ.లక్షల్లో వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. కరోనాలో ఏలూరులోని చైత్ర ఆసుపత్రితోపాటు, మరో ఆసుపత్రి యాజమాన్యం రోగులను పీల్చి పిప్పి చేస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక ఆసుపత్రిపై చర్యలు తీసుకున్న అధికారులు అప్పటి అధికార పార్టీ అండ ఉన్న చైత్ర ఆసుపత్రిపై మాత్రం కనీస చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు చైత్ర ఆసుపత్రిపై విజిలెన్స్‌తోపాటు వైద్య, విద్యుత్, డ్రగ్‌కంట్రోల్, అగ్నిమాపకశాఖ అధికారులంతా ఏకకాలంలో దాడి చేశారు. చైత్ర ఆసుపత్రినే కాకుండా ప్రయివేటు ఆసుపత్రుల్లో జరుగుతున్న అవకతవకలపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

1100 సేవలను వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కారానికి మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయొచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

పేరుపాలెం బీచ్‌లో ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి - మొగల్తూరు

గణేష్ (ఫైల్‌ఫొటో)

స్నానం చేసి వెంటనే వస్తానని సముద్రంలోకి దిగిన ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతైన ఘటన పేరుపాలెం బీచ్‌లో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పేరుపాలెం బీచ్‌కు ఏలూరులోని కొత్తపేటకు చెందిన మునగాల మోహన్‌సాయి గణేష్ (19), తన ఇంటి సమీపంలోని ముగ్గురు మిత్రులతో కలిసి ఆదివారం ఉదయం మోటారు సైకిళ్లపై చేరుకున్నారు. కొద్దిసేపు బీచ్‌లో స్నానాలు చేశారు. అనంతరం ఒడ్డుకు వచ్చారు. మిత్రులను ఒడ్డున కూర్చోమని, తాను వెంటనే స్నానం చేసి వస్తానంటూ సాయిగణేష్ మరోసారి సముద్రం లోపలికి వెళ్లాడు. అలల ఉధృతికి గణేష్ గల్లంతయ్యాడు. ఈ విషయం తెలియగానే మొగల్తూరు ఎస్ఐ జి.వాసు, మెరైన్ అంతర్వేది ఎస్ఐ పి.సోమశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. మోహన్‌సాయిగణేష్ విజయవాడ సమీపంలోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దీనిపై గణేష్ చిన్నాన్న సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వాసు తెలిపారు.

బాలోత్సవం మూడో పిల్లల సంబరాలను విజయవంతం చేయాలి

బాలోత్సవ కమిటీ అధ్యక్షులు ప్రసాద్‌రాజు

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న బాలోత్సవ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ రాజు

భీమవరం బాలోత్సవం మూడో పిల్లల సంబరాలు విజయవంతం చేయాలని బాలోత్సవ కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాద్‌రాజు పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయం భీమవరం బాలోత్సవ కమిటీ సమావేశం అధ్యక్షులు ప్రసాదరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ డిసెంబర్ 12, 13వ తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి వాటిని అమలు చేయడానికి భీమవరం పట్టణ, భీమవరం రూరల్, వీరవాసరం, పాలకోడేరు, ఉండి, కాళ్ల, ఆకివీడు మండలాల నుంచి సుమారు రోజుకు రూ.2,500 మంది వరకూ బాలబాలికలు పాల్గొనేందుకు కావాల్సిన ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వాటికి కావాల్సిన కమిటీలు, వంద మంది వాలంటీర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భీమవరం బాలోత్సవం ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం 18 కల్చరల్, 15 అకాడమిక్ అంశాల్లో బాలోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బాలోత్సవాలకు దాతలు, విద్యాసంస్థలు, అధికారులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్, ప్రోత్సాహకులందరూ సహకరించాలని కోరారు. పది రోజుల నుంచి అప్లికేషన్లు భీమవరం రూరల్, టౌన్, వీరవాసరం, పాలకోడేరు, కాళ్ల, ఉండి, ఆకివీడు మండలాలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పూర్తి చేసిన అప్లికేషన్లు ఈ నెల 30వ తేదీలోగా భీమవరం బాలోత్సవం భవనం శ్రీరాంపురంలో ఉన్న కస్తూరిబా గాంధీ భవనం లేదా యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు. భీమవరం బాలోత్సవం ఉపాధ్యక్షుడు గాతల జేమ్స్, ట్రెజరర్ పి.సీతారామరాజు, కల్చరల్ కమిటీ కన్వీనర్ బి.చైతన్యప్రసాద్, అకాడమిక్ కమిటీ కన్వీనర్ పి.శ్రీనివాసరాజు, ఎస్.సత్యనారాయణరాజు, జి.రఫాయేలు, సిహెచ్.రామకృష్ణంరాజు, కె.గోపాలశర్మ, కె.అశోక్, టి.ప్రసాద్, సిహెచ్.యశ్వంత్, ఛాన్ బాషా, పి.వాసు తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

సముద్ర కెరటాల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

మండలంలోని పేరుపాలెం సౌత్, కెపి.పాలెంసౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. కార్తీక మాసం ముగిసి మొదటి ఆదివారం కావడంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు అధిక సంఖ్యలో ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తెన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న వెంకటేశ్వరస్వామి, పాండురంగస్వామి, వేళాంకిణి మాత, 54 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయాలను సందర్శించారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి శ్రీవేద సూచనల మేరకు సిఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ జి.వాసు పర్యవేక్షణలో మెరైన్ అంతర్వేది ఎస్ఐ పి.సోమశేఖర్ రెడ్డి, రక్షణ, ఎక్సైజ్, ఫైర్, మత్స్యశాఖ, పంచాయతీరాజ్, రెవెన్యూ తదితర శాఖలు విధులు నిర్వహించారు. బీచ్ వద్ద ప్రత్యేక ప్రాంతాల్లో భారికేడ్లు ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను నియమించారు.

ఈత పోటీల్లో జోస్నశ్రీ ప్రతిభ

ప్రజాశక్తి - వీరవాసరం

పెర్చిపాలెం గ్రామానికి చెందిన కోరశిఖ జోస్నశ్రీ ఆదివారం విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో కాంస్య పతకం సాధించింది. ఆక్వాటిక్ స్విమ్మింగ్ కాంపిటేషన్ 2025 రాష్ట్రస్థాయి (గ్రూప్-1 మహిళా విభాగంలో సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో ఆమె ఈ ఘనత సాధించిందని తండ్రి వీర్రాజు తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె మౌక్తిక కూడా ఈత పోటీల్లో ప్రతిభ చాటింది. అక్కను ఆదర్శంగా తీసుకొని జోస్నశ్రీ ఈత పోటీల్లో తన ప్రతిభను నిరూపించుకుంటోంది. ఈ సందర్భంగా జోస్నశ్రీను అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షులు గొలగాని సత్యనారాయణ, కందుల భానుప్రసాద్, పెర్చిపాలెం సర్పంచి కందుల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కోరశిఖ పెద్దిరాజు అభినందించారు.

అధునాతన లేబరేటరీల నిర్మాణానికి శ్రీకారం

భూమి పూజ చేస్తున్న కలెక్టర్

ఉండి: 107 సంవత్సరాల చరిత్ర కలిగిన ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆదివారం సాయంత్రం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఎం శ్రీ పథకం ఫేస్ 7లో భాగంగా రూ.65 లక్షలతో ఏర్పాటు చేయనున్న అధునాతన లేబరేటరీలకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సుమారు రూ.65 లక్షల నిధులను బయాలజీ ల్యాబ్, కెమిస్ట్రీ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ నిర్మించడానికి మంజూరు చేయగా క్రీడా మైదానం అభివృద్ధికి రూ.ఐదు లక్షలు, సోలార్ విద్యుత్ ఏర్పాటుకు మరో రూ.ఐదు లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలోని క్రీడా మైదానం గురించి ఆంధ్ర క్రికెట్ బోర్డు దృష్టికి తీసుకెళ్లామని, వారు కూడా త్వరలోనే స్టేడియం నిర్మాణం చేసే అవకాశం ఉందని వివరించారు. అనంతరం గ్రామంలో చెత్త బుట్టలను ఇంటింటికీ పంపిణీ చేశారు. సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, డిఇఒ రామనాథరెడ్డి, డిఇఇ నారాయణ, ఆర్‌డిఒ టి.ప్రవీణ్ కుమార్ రెడ్డి, పాఠశాల హెచ్ఎం వై.రామలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు

ప్రజాశక్తి - మొగల్తూరు

బీచ్‌లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జి.వాసు హెచ్చరించారు. పేరుపాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు పోటెత్తడంతో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. పలువురు వద్ద ఉన్న మద్యం సీసాలను మద్యాన్ని వారితోనే కింద ఒంపించారు. బీచ్‌లోకి మద్యం అనుమతించేది లేదని తెలిపారు. మద్యం తాగి బీచ్‌లో స్నానానికి వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేన్సర్‌పై మహిళలకు అవగాహన

వీరవాసరం :కేన్సర్‌పై ప్రతి మహిళా అవగాహనతో ఉండాలని ట్రస్ట్ సభ్యురాలు ఆకుల మౌనిక అన్నారు. కొల్లా భాస్కరావు, శ్రీ వీర రాఘవులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వీరవాసరంలో మహిళలకు సర్వైకల్, బ్రెస్ట్ కేన్సర్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల ఆరోగ్య దృష్ట్యా వీరవాసరంలోని అనేక ప్రాంతాల్లో మహిళలకు కేన్సర్ పట్ల అవగాహన పెంపొందిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. మెడిటే ప్రయత్నంలో భాగంగా మెయిన్ స్కూల్, బలుసుపాలెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి మహిళకూ స్క్రీనింగ్ టెస్టులు, వాక్సినేషన్లు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.

మానవతలో సభ్యత్వం

పెనుమంట్ర:సామాజిక సేవలో అగ్రగామి స్వచ్ఛంద సంస్థ మానవతలో చేరడం సభ్యుల సుకృతమని వి.శాఖ తహశీల్దార్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి అన్నారు. విస్తృత ప్రచారం ద్వారా సభ్యత్వం పెంచి, మరింత మందికి సేవ చేయాలని ఆయన కోరారు. ఆదివారం మార్టేరులోని సంస్థ కార్యాలయంలో మానవత మండల అధ్యక్షులు శిరం విశ్వనాధం ఆధ్వర్యంలో స్థానిక విద్యా వికాస్ స్కూల్ కరస్పాండెంట్ బోడపాటి సోమేశ్వరరావు, జయశ్రీ దంపతులకు, స్థానిక విద్యుత్ లైన్ మెన్ కొడాలి శివ నాగ ప్రసాద్‌కు సంస్థ ఆత్మీయ సత్కారం చేసింది. ఈ సందర్భంగా తమ కుమారుడు స్వర్గీయ బోడపాటి నర్సింహసాయి ప్రణీత్ పేరిట సోమేశ్వరరావు, జయశ్రీ రూ.25 వేల విరాళంతో శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మానవత ప్రధాన కార్యదర్శి కరి సుబ్రహ్మణ్యం, కె.సత్యనారాయణ, బండారు స్వామీజీ గుప్త, పడాల సువర్ణరాణి, బాణాల శ్రీనివాసరావు, పూర్వ అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, గుత్తుల సాల్మన్ దొర, కేశవరెడ్డి, గుబ్బల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

ఇరగవరం:వీఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 16వ తేదీన విజయవాడలోని సిసిఎల్ఎ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెవిసి యూనియన్ కమిటీ కార్యదర్శి పి.గణేశ్వరరావు కోరారు. తాడేపల్లిగూడెం డివిజన్ విఆర్ఎలతో మండల అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అటెండర్, నైట్ వాచ్‌మెన్, విఆర్ఏ, డ్రైవర్ పోస్టుల్లో విఆర్ఎల ద్వారా భర్తీ చేయాలన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బివివి.ఏడుకొండ, జిల్లా సెక్రటరీ మోటూరి మోసే, భీమవరం డివిజన్ ప్రెసిడెంట్ సుబ్బారావు, శ్రీకాంత్, విఆర్ఎలు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి రాయకుదురు విద్యార్థిని

యేలేటి జాయిస్

వీరవాసరం: రాయకుదురు హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని యేలేటి జాయిస్ మాక్ అసెంబ్లీకి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న అమరావతి అసెంబ్లీ హాల్‌లో మాక్ అసెంబ్లీలో జాయిస్ పాల్గొనున్నట్లు చెప్పారు. ఈ మాక్ అసెంబ్లీలో రాజ్యాంగం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడం, రాజ్యాంగ విలువలు నేర్పించడం, చర్చల పట్ల నైపుణ్యం పెంపొందించడం మాక్ అసెంబ్లీ ప్రధానోద్దేశమన్నారు. మాక్ అసెంబ్లీకి ఎంపికైన యేలేటి జాయిస్‌ను ప్రధానోపాధ్యాయులు, హైస్కూలు సిబ్బంది, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శలా భవాని, సర్పంచి గెడ్డం భారతీభాస్కరరావు, ఎంపిటిసి గుండా ఉదయశ్రీ అభినందించారు.

టిడిపి కంచుకోట యలమంచిలి : మంత్రి

యలమంచిలి:టిడిపి ఆవిర్భావం నుంచి యలమంచిలి మండలం చెక్కు చెదరని కంచుకోటగా, పార్టీ శ్రేణులతో పార్టీ కోసం కష్టపడి పని చేస్తుందని, తాను మూడుసార్లు వరుసగా ఎంఎల్ఏగా గెలుపొందానంటే యలమంచిలి కీలకమని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. యలమంచిలిలో టిడిపి మండల కమిటీ, అనుబంధ విభాగాల కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. టిడిపి మండల అధ్యక్షుడు మామిడి శెట్టి పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శి ముచ్చర్ల శ్రీనివాస్ ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ముందుగా మేడపాడు గ్రామ సెంటర్ నుంచి వేలాదిమంది పార్టీ శ్రేణులతో కలిసి మంత్రి రామానాయుడు భారీ మోటార్ సైకిల్ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోలకొల్లు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేలా నిత్యం అభివృద్ధి, సంక్షేమం దిశగా పనిచేస్తున్నానని తెలిపారు. అభివృద్ధితోపాటు సంక్షేమం అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. వైసిపి పాలనలో అభివృద్ధి సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. మాజీ ఎంఎల్ఏ అంగర రామ్మోహన్, ఉభయగోదావరి జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

నరసాపురం:నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 24వ తేదీన సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ దాసిరాజు తెలిపారు. డివిజన్లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులను ఉదయం 10:30 నుంచి అందించాలని కోరారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

మొగల్తూరు:ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం సభ్యులు ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. యాత్రికులు అసౌకర్యానికి గురికాకుండా ఆలయ అసిస్టెంట్ ఎం.జగదీష్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా ఎన్‌సిసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం

డిఎఆర్ కళాశాల క్రీడా మైదానంలో డిఎన్ఆర్ కళాశాల సీనియర్ డివిజన్ ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో ఎన్‌సిసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. డిఎన్ఆర్ కళాశాల పాలకవర్గ సహాయ కార్యదర్శి ఆర్.రామకృష్ణంరాజు ముఖ్యఅతిథిగా హాజరై ఈ వేడుకల పెరేడ్‌ను సమీక్షించి, వివిధ స్థాయిల్లో ప్రతిభావంతులైన ఎన్‌సిసి క్యాడెట్లకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాలుగా యువతకు ముఖ్యంగా విద్యార్థులకు మార్గదర్శకత్వం వహిస్తూ ఎంతోమంది జీవితాలకు బంగారు బాటలు వేసిందన్నారు. ఎంతో మంది నాయకులనూ జవాన్ లను దేశానికి అందించిందని తెలిపారు. కళాశాల పాలక వర్గ సభ్యులు పి.రామకృష్ణరాజు మాట్లాడుతూ ఎన్‌సిసి కాడెట్ల క్రమశిక్షణకు మారు పేరు అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ జి.మోజెస్ మాట్లాడారు. అనంతరం జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరచిన క్యాడెట్లకు మెడల్స్, ప్రసంశా పత్రాలు అందజేశారు. డిఎన్ఆర్ కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ మేజర్ ఎ.వీరయ్య పెరేడ్ కమాండర్‌గా వ్యవహరించగా రన్ ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించారు. ఈ రన్‌ను కళాశాల పాలకవర్గ సహాయ కార్యదర్శి ఆర్.రామకృష్ణంరాజు జెండా ఊపి ప్రారంభించారు. డిఎన్ఆర్ కళాశాల రోడ్డు, జువ్వల పాలెం రోడ్డు, అంబేద్కర్ చౌక్, తాలూకా కార్యాలయం, ప్రభుత్వాసుపత్రి మీదుగా సాగింది. సీనియర్ క్యాడెట్లు ఆర్.డేవిడ్, పి.హేమంత్ కుమార్, డి.మల్లేశ్వరి పాల్గొన్నారు.

నరసాపురంలో మొక్కలు నాటుతున్న క్యాడెట్లు

నరసాపురం : వైఎన్ కళాశాలలో ఎన్‌సిసిడే సందర్భంగా 7 ఆంధ్ర నావల్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా ఎన్‌సిసి క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటడం, పరిసరాల శుభ్రత వంటి కార్యక్రమాలను చేపట్టి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సేవ అందించారు. అనంతరం గోదావరి నదీ తీర ప్రాంతంలో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా క్యాడెట్లు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించి ప్రజలకు పర్యావరణ అవగాహన కల్పించారు. 7 ఆంధ్ర నావల్ యూనిట్ సిఒ లెఫ్టినెంట్ కమాండర్ చిట్టి రోహిత్ కుమార్ మాట్లాడుతూ ఎన్‌సిసి ప్రాధాన్యం కోసం, సొసైటీ విలువల కోసం, దేశ ప్రాధాన్యత కోసం, యువతలో సేవా భావం, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం ఎన్‌సిసి ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో క్యాడెట్ల పరస్పర సమావేశం (ఇంటరాక్షన్) నిర్వహించారు.అనంతరం మొక్కల నాటి మెయిన్ రోడ్డు, బస్ స్టాప్ నుండి రైల్వేస్టేషన్ రోడ్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్.రౌత్రాయ్, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ జి.సునీత, పిఐ, ఎన్‌సిసి ప్రథమ బోధకుడు మద్ది ధర్మ రాజు పాల్గొన్నారు.

తణుకు: ఎన్‌సిసి దినోత్సవాన్ని పురస్కరించుకుని మాంటిస్సోరీ స్కూల్, జూనియర్ కాలేజీలో 19(ఎ) బిఎన్ ఎన్‌సిసి (ఆర్మీ) ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సిసి దినోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. త్రివర్ణ పతాకంతో 8, 9 తరగతులకు చెందిన ఎన్‌సిసి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సిసి ఉపాధ్యాయులు శ్రీను, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల యుజి, పిజి (అటానమస్), జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలు ఎన్‌సిసి డేను ఘనంగా నిర్వహించారు. ఎన్‌సిసి క్యాడెట్స్ ర్యాలీ నిర్వహిస్తూ సంధ్యాజ్యోతి వృద్ధాశ్రమానికి చేరుకుని వృద్ధులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్స్ అందజేశారు.

ఫార్మ్లి హైడ్రోపోనిక్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉన్నత విద్యతోపాటు రైతులకు ఉపయోగపడే టెక్నాలజీ ఉపయోగిస్తూ ఆరుళ్ల గ్రామంలో ఫార్మ్లి హైడ్రోపోనిక్ ప్లాంట్‌ను ప్రారంభించిన మాకరాజు హేమంత్ వర్మను యువత ఆదర్శంగా తీసుకోవాలని వైసిపి రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆక్వా కల్చర్ వడ్డీ రఘురాం తెలిపారు. ఆరుళ్ల గ్రామ మాజీ సర్పంచి మాకరాజు సతీష్ తనయుడు మాకరాజు హేమంత్ వర్మ నూతనంగా నిర్మించిన హైడ్రోపోనిక్ ప్లాంట్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ హైడ్రోపోనిక్ సాగుతో రైతులకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందన్నారు. పురుగు మందులు వాడకుండా చేసే ఈ వ్యవసాయంతో ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిసరాల ప్రజలు హైడ్రోపోనిక్ ప్లాంట్ వ్యవసాయంపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. హైడ్రోపోనిక్ ప్లాంట్‌లో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచే పోషకాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. హేమంత్ వర్మ మాట్లాడుతూ తక్కువ ప్రాంగణంలో అధిక దిగుబడి అనే పద్ధతిలో ప్రేమ్లీ హైడ్రోపోనిక్ ప్లాంట్ ఆరుళ్ల గ్రామంలో ప్రారంభించామని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు సాగు చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని హైడ్రోపోనిక్ ప్లాంట్లపై అవగాహన పెంచుకోవాలన్నారు. త్వరలో కొన్ని రకాల మొక్కలపై పరిశోధనలు మొదలు పెడతానని హేమంత్ వర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శేషులత, కొప్పు వెలమల మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీను, ఎంపిటిసి వెంకన్న, సబ్బితి బ్రహ్మయ్య, పామర్తి హరిసాయి అఖిల్, ఆచంట వెంకటకాంత తేజ, ఆరుళ్ల గ్రామస్తులు, రైతులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫార్మ్లి హైడ్రోపోనిక్ ప్లాంట్‌ను ప్రారంభించిన హేమంత్ వర్మ

అందుబాటులోకి క్లూస్ టీమ్ వాహనం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సబ్ డివిజన్‌లో నేర పరిశోధనకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్రత్యేక క్రైమ్ స్పాట్ క్లూస్ టీమ్ వాహనం అందుబాటులోకి వచ్చింది. ఆదివారం డిఎస్‌పి జి. శ్రీవేద ఈ వాహనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ క్రైమ్ స్పాట్ వాహనాలు ఘటనాస్థలాలకు త్వరితగతిన చేరడానికి, ఆధునిక పరికరాలతో దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచడానికి ఉపయోగపడతాయన్నారు. క్రైమ్ స్పాట్ వాహనాలు పోలీసులు చేసే ఫీల్డ్ ఇన్వెస్టిగేషన్‌ను మరింత వేగవంతం చేస్తాయన్నారు. ఫోరెన్సిక్ కిట్లు, డిజిటల్ డాక్యుమెంటేషన్ పరికరాలు, ప్రాథమిక సాక్ష్య సేకరణ సాధనాలు వీటిలో ఏర్పాటు చేసినట్టు వివరించారు. సంఘటనలు జరిగిన వెంటనే స్పందించడం ద్వారా నేర పరిశోధనలో కీలక ఆధారాలను త్వరగా సేకరించే అవకాశం పెరుగుతుందని చెప్పారు. క్లైమ్ స్పాట్ టీం లేదా క్లూస్ టీం ఒక నేరం జరిగేటప్పుడు ఆ నేరం జరిగే స్థలంలో ఎటువంటి ఆధారాలు ఉంటాయో వాటిని పరిశీలించి ఆ క్లైమ్ కి ఆధారాలు సేకరించడానికి క్లూస్ టీం సహాయ పడుతుందన్నారు. ప్రజా భద్రతను మరింత బలోపేతం చేయడం కోసం పోలీసులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారన్నారు. నేరాల నియంత్రణలో, విచారణలో పోలీసు బృందాల సామర్థ్యం పెరగడంలో ఈ వాహనాలు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. నేరస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోలేరని తెలిపారు. ఈ క్లూస్ టీమ్ వాహనానికి ఇన్‌ఛార్జి హెడ్ కానిస్టేబుల్ టి.పాపారావు, కానిస్టేబుల్స్ అంబటి కిరణ్, బైనపాలెం పుల్లారావును సిబ్బందిగా నియమించినట్లు తెలిపారు.

క్లూస్ టీమ్ వాహనం వద్ద సిబ్బంది

విద్యార్థులకు చెకుముకి సైన్స్ సంబరాలు దోహదం : ఎంఎల్‌సి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చినఅమిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి జిల్లాస్థాయి సైన్స్ సంబరాలను ప్రారంభించి మాట్లాడారు. సమాజ పురోభివృద్ధికి జన విజ్ఞాన వేదిక వంటి సంస్థలు అవసరమన్నారు. చెకుముకి సైన్స్ సంబరాలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, ఆలోచనా శక్తిని, విజ్ఞాన శాస్త్రం పట్ల అభిరుచిని పెంపొందించడానికి దోహదపడతాయని అన్నారు. బహుమతి ప్రదానోత్సవానికి విచ్చేసిన ముఖ్యఅతిథి జిల్లా విద్యాశాఖ అధికారి ఇవివిఎన్ఎస్ఎస్‌బిఎల్.నారాయణ మాట్లాడుతూ జెవివి విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్‌ను పెంచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చిన్న తరగతుల నుండి సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. బహుమతి ప్రదానోత్సవ సభకు అధ్యక్షత వహించిన జిల్లా చెకుముకి కన్వీనర్ రేపాక వెంకన్న బాబు మాట్లాడుతూ మండల, పట్టణ స్థాయిలో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాల నుండి 20 టీమ్‌లు, ప్రయివేటు పాఠశాలల నుండి 11 టీంలు పాల్గొన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చింతపర్రు విద్యార్థులు ప్రయివేటు పాఠశాలల నుండి భీమవరం విష్ణు స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో జెఎన్‌టియు కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాలకు ఎంపికయ్యారని ప్రకటించారు. విజేతలకు డిఇఒ జ్ఞాపిక, ప్రశంసా పత్రం, జెవివి పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, పాఠశాల హెచ్ఎం వి.అనూరాధ, విద్యాదాత పొత్తూరి బాపిరాజు, జెవివి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెవివి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జామాను రామలక్ష్మణరావు, మల్లుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చింతపల్లి ప్రసాదరావు, కోశాధికారి టి.వెంకటేశ్వరరావు, అలుగు జాన్సన్, మండల కన్వీనర్లు ఎం.సోమేశ్వరరావు, ఎ.లోకేశ్వరరావు, పి.ఫణి రాజేష్, వై.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోపీమూర్తి

డొక్కా సీతమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఆచంట

నిత్య అన్నదాత, పేదల పాలిట పెన్నిధి డొక్కా సీతమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. ఆదివారం కోడేరు వశిష్ట గోదావరి ఒడ్డున ఆత్మీయ సేవా కేంద్రం ప్రాంగణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా అధ్యక్షతన జరిగింది. ముందుగా డొక్కా సీతమ్మ విగ్రహానికి, ఆత్మీయ సేవా కేంద్రం వ్యవస్థాపకులు వెలిశెట్టి రామలింగేశ్వర స్వామి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు, చిన్నారులు పాల్గొని ఉత్సాహంగా ఉల్లాసంగా ఆటలు పాటలతో మ్యూజికల్ ఛైర్స్, కబడ్డీ, అంత్యాక్షరి, కోకో, అంగన్వాడీల ఆధ్వర్యంలో కోలాటం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ మదర్ థెరిస్సా ప్రార్థించే చేతుల కన్నా, సహాయం చేసే చేతులు మిన్న అనే వాక్యాలు ఈరోజు ఎంతమంది ఆచరిస్తున్నారో లేదో గాని సిపిఎం మాత్రం తూచా తప్పకుండా ఆచరిస్తోందని తెలిపారు. మనకు మంచి బతుకు రావాలంటే సిపిఎం అధికారంలోకి రావాలని అన్నారు.



డొక్కా సీతమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంతెన సీతారాం

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ లంకల గన్నవరంలో నిత్యాన్నదానం చేస్తూ పేదల ప్రేమ ఆప్యాయతను చూపిస్తూ అందరి మన్నలు పొందిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యులు తలపూరి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, బండి రంగారావు, బొర్రా ధర్మారావు, టి.సత్యనారాయణ, శ్రీనివాస్, ఎస్.వెంకటేశ్వరరావు, శ్రీను, బాలకృష్ణ, నాగాంజనేయులు, పద్మారావు, కేతా పద్మ పాల్గొన్నారు.

దాతలు సహకరిస్తే మరింత అభివృద్ధి

ఆకివీడు :దాతలు సహకరిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చుని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారికి రెండు పక్కలా డ్రెయినేజీ నిర్మాణానికి ఆదివారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.48 లక్షల రూపాయలతో సుమారు కిలోమీటరు పొడవునా ఈ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి రామవరప్రసాద్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గొట్టుముక్కల సత్యనారాయణ రాజు మాట్లాడారు. అనంతరం స్థానిక దొర గారి చెరువు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పరిశీలించి అధికారులతో సమీక్షించారు. అధికారులు, నేతలు ఉన్నారు.

రాజకీయాలకతీతంగా ప్రజా సేవే లక్ష్యం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ

శ్రీనివాస వర్మ మరో 20 ఏళ్లు ఎంపీగా సేవలందించాలి : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - భీమవరం

రాజకీయాలకతీతంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా భీమవరంలో నూతనంగా ఆధునిక సదుపాయాలతో నిర్మించిన తన క్యాంపు కార్యాలయం పనిచేస్తుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలోని నరసయ్య అగ్రహారంలో నూతనంగా నిర్మించిన కేంద్ర సహాయ మంత్రి క్యాంపు కార్యాలయాన్ని ఆదివారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌ఎలు పులపర్తి రామాంజనేయులు, పితాని సత్యనారాయణ, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పాందువ్వ శ్రీను కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఎంఎల్‌సి గోపీమూర్తి, జనసేన జిల్లా అధ్యక్షులు కె.గోవిందరావు, మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ కనకరాజు సూరి, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు, కృష్ణ బలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు, టిడిపి సీనియర్ నాయకులు మెంటే పార్థసారథి, రామరాజు, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక తదితరులు శ్రీనివాస వర్మకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో శ్రీనివాస వర్మ మాట్లాడుతూ నర్సాపురం పార్లమెంట్ పరిధిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యతిస్తున్నట్లు తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ శ్రీనివాస్ వర్మ పార్లమెంట్ సభ్యుడిగా ఉండడం ప్రజల అదృష్టం అన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

మహారాజశ్రీ కాకినాడ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు

E.P.No.213/2025,inO.S.No.872/2024

సాగి వెంకట సత్యనారాయణ వర్మ
...డిహెచ్ఆర్/వాది
మరియు
గుడుపూడి రమేష్ బాబు
...జెడిఆర్/ప్రతివాది

టు.
జెడిఆర్ గుడుపూడి రమేష్ బాబు(పి.సి.2438) తండ్రి.గుడుపూడి వెంకటరత్నం, ఇంటినెం.3-12, మాదేపల్లి, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు అమలు గ్రంధములో జెడిఆర్ అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం **ది.11-12-2025** తేదికి వాయిదా వేస యున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం **10.30ని॥లకు** మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

చిత్తలూరి వెంకట సుబ్బారావు
చిత్తలూరి అనురాధ
అడ్వకేట్స్, డోర్‌నెం.5-81,
సంతోష్‌నగర్, కాకినాడ
సెల్.9948519236

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఉండి

ఉండిలో నిర్వహిస్తున్న రీసర్వేలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉండి లో పర్యటించిన కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పారదర్శకంగా నిర్వహించాల్సిన రీసర్వేలో అధికారులు పొరపాట్లకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇవి పునరావృతం కాకుండా పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఇంటి స్థలం ఉండి ఇల్లు నిర్మించదలచిన వారిని సర్వే చేసి ఇంటి నిర్మాణంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత గృహ నిర్మాణ శాఖ అధికారులపై ఉందన్నారు. కలెక్టర్ వెంట అధికారులు ఉన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం

భీమేశ్వరస్వామి దేవస్థానం సమీపంలోని సత్యసాయి మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సత్యసాయి బాబా జయంతి వేడుకలు అధికారికంగా ఆదివారం నిర్వహించారు. బాబా చిత్రపటానికి కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఎవ్వరినీ నొప్పించకూడదనేది బాబా సిద్ధాంతమన్నారు. ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా ప్రపంచ దేశాలలో భగవంతునిగా కొనియాడుతున్న పురాణ పురుషుడు అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లక్షల మందికి విద్య, వైద్యపరంగా భగవాన్ అనేక సేవలందించారన్నారు. అనంతరం బాబా శత వార్షిక లోగో, 2026 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. బాబా సేవ సమితి ప్రతినిధులు జిల్లా కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిని సత్కరించారు. డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, డిపిఒ ఎం.రామనాథరెడ్డి, డిఎఫ్‌ఒ బి.శ్రీనివాసరావు, బిసి సంక్షేమ శాఖ అధికారి సూరిబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాళ్ల : పుట్టపర్తి సాయి సత్యసాయి బాబా జయంతి వేడుకలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ దోసి రెడ్డి, తహశీల్దార్ జి.సుందర్ సింగ్, ఎంపిడిఒ జి.స్వాతి,కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆంజనేయులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కుటుంబ సభ్యులు

ఆంజనేయులు ఆశయ సాధనకు కృషి

సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు

ప్రజాశక్తి - యలమంచిలి

సిపిఎం సీనియర్ నేత గుబ్బల ఆంజనేయులు ఆశయసాధనకు అంతా కృషి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అన్నారు. యలమంచిలికి చెందిన మాజీ శాఖ కార్యదర్శి గుబ్బల ఆంజనేయులు ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆదివారం యలమంచిలిలో ఆంజనేయులు సంతాప సభ జరిగింది. తొలుత ఆంజనేయులు చిత్రపటానికి సిపిఎం నాయకులతోపాటు వారి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ 1980 నుండి ఇప్పటి వరకు సుమారు 45 సంవత్సరాలపాటు ఆంజనేయులు పార్టీ సభ్యునిగా కొనసాగారన్నారు. అనేక ప్రజా సమస్యలపై పార్టీ తరపున జరిగిన పోరాటాలు, ఆందోళనల్లో ఎంతో చురుగ్గా పాల్గొనేవారని, అటువంటి నేతను కోల్పోవడం పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు కుటుంబ సభ్యులు, సిపిఎం నాయకులు బాతిరెడ్డి జార్జి, దేవ సుధాకర్, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, మామిడిశెట్టి కృష్ణ, శెట్టిమిట్టి భాస్కరరావు, కేతా శ్రీను, తాడి ఉదయ్, యడ్ల మోహన్‌రావు, కొప్పిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో

O.S.547/2025

Between:
కొవ్వూరి అనురాధ (రిప్రజెంటెడ్ బై జనరల్ బాడీ ఆఫ్ క్రెడిటర్స్) ...వాది
మరియు
1.సత్తి వెంకట లక్ష్మి, W/o.కేశవరెడ్డి, D.No.3-84A, అర్జునుడుపాలెం, ఇరగవరం మండలం, ప.గో.జిల్లా.-534217, సెల్: 9392393936.
2.సత్తి వెంకట నాగేంద్రరెడ్డి, S/o.కేశవరెడ్డి, D.No.3-84A, అర్జునుడుపాలెం, ఇరగవరం మండలం, ప.గో.జిల్లా.-534217, సెల్: 9392393936.
...ప్రతివాదులు

పై గ్రంథములో వాది తనకు 1వ ప్రతివాది నుండి రావలసిన బాకీ రాబట్టుకొనే నిమిత్తం దాఖలు చేసినారని, సదరు దావాలో మొదటి ప్రతివాది అయిన మీరు వాదికి మరియు కొంత మందికి అప్పులు తీసుకుని ఆ అప్పులు చెల్లించకుండా ఉండుటకు గాను మొదటి ప్రతివాది తమ స్థిరాస్తులను రెండవ ప్రతివాది పేరు మీదగా సెటిల్మెంట్ దస్తావేజులు వ్రాయించి యిచ్చినారు. వాదికి మరియు అప్పులిచ్చిన క్రెడిటర్‌లకు బాకీలు తీర్చకుండా కాలయాపన చేయుచున్నారని, అందుచేత ఈ నోటీస్ పేపరు ద్వారా అమలు చేయవలెనని పై కోర్టు వారు ఆర్డర్ వేసినందున సదరు ప్రతివాదులు ది.11-12-2025 సం॥ తేదీన ఉదయం 10 గంటలకు పై కోర్టునకు హాజరై స్వయంగా గాని లేదా ప్లీడర్ గారి ద్వారా గాని తమ వాదనలు తెలియజేయవలసిందిగా, లేనియెడల సదరు దావా సదరు ప్రతివాదుల పరోక్షమున తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

V.S.R.DEEKSHITULU
Advocate, Tanuku.
Cell: 9346700133.
Tanuku
Dt.21-12-2025